సాక్షి
కుమురం భీం
గురువారం, 8, జూన్, 2023

నిండా ముంచిన వైన్ యాప్!



సైబర్ నేరగాళ్లు లాభాల ఆశచూపి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. తాజాగా వైన్‌యాప్‌లో పెట్టుబడి పెట్టి చెన్నూర్ మండలంలో పలువురు మోసపోయారు. 8లో▶



ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

తెలంగాణ రాష్ట్రస్థాయి 9వ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. నల్గొండ జట్టు విజేతగా నిలిచింది. 10లో▶

గరిష్టం/కనిష్టం
43.8/31.2

వాతావరణం

ఉదయం కొంతమేర మేఘాలు ఉంటాయి. జిల్లాలో పలుచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోద వుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉండి, వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాల సరఫరాపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: జిల్లాలో మాదక ద్రవ్యాల సరఫరాపై నిఘా పెంచాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్పీ సురేశ్‌కుమార్, మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సభ్యులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, గంజాయి సాగు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్తు పదార్థాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో గంజాయి, డ్రగ్స్ రవాణా, వినియోగంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తో అన్ని వర్గాల అభివృద్ధి



బుద్ధుడి విగ్రహం వద్ద ఎమ్మెల్సీ విఠల్, నాయకులు

సిర్పూర్(టి): బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి జరుగుతుందని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని బుధవారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి) నియోజకవర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట కోనేరు ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ, కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, నాయకులు బ్రహ్మయ్య, మహేశ్ తదితరులు ఉన్నారు.

'సర్పంచ్ కుమారుడిని అరెస్ట్ చేయాలి'



చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

చింతలమానెపల్లి(సిర్పూర్): ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దుర్మార్గాలకు పాల్పడిన డబ్బా సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్‌ను వెంటనే అరెస్టు చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బా గ్రామంలోని ఆదివాసీ మహిళ ఇంట్లో అబ్దుల్ రషీద్ చొరబడి అత్యాచార యత్నం చేశాడని ఆరోపించారు. ఆ సమయంలో శబ్దాలు విన్న కొంతమంది అడ్డుకుని ప్రశ్నించారని పేర్కొన్నారు. అధికార మదంతో అతడు ఆదివాసీలను కులం పేరుతో దూషించాడని ఆరోపించారు. దీంతో సహనం కోల్పోయిన స్థానికులు తాళ్లతో కట్టి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారని తెలిపారు. ఆదివాసీల మనోభావాలను కించపరిచిన రషీద్‌ను రెండు రోజుల్లో అరెస్టు చేయని పక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి మాట్లాడుతూ పోలీసులు ఆదివాసీలకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డబ్బా సర్పంచ్ కుమారుడు ఆదివాసీ మహిళపై దుర్ఘటనకు పాల్పడగా బాధితురాలిని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సమంజసం కాదన్నారు. మహిళను బెదిరింపులకు గురిచేసి, గ్రామానికి కాకుండా గుర్తుతెలియని ప్రాంతానికి తరలించారని ఆరోపించారు. చట్టప్రకారం రషీద్‌ను అరెస్టు చేయకపోతే తర్వాత జరిగే పరిణామాలకు పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ డివిజన్ నాయకులు నగేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు బుర్రి నీలయ్య పాల్గొన్నారు.



పెరిగిన మద్దతు

- ఖరీఫ్ ప్రారంభానికి ముందు అన్నదాతకు శుభవార్త
- క్వింటాల్ వరి ధాన్యానికి రూ.143, పత్తికి రూ.640 ఎంఎస్‌పీ పెంపు
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై రైతుల హర్షం
- జిల్లాలో 4.55 లక్షల ఎకరాల్లో పంటల సాగు అంచనా

ఈ వానాకాలంలో సాగు అంచనా

సాగు విస్తీర్ణం	ఎకరాలు
పత్తి	3,42,000
వరి	58,770
కంది	35,000
సోయాబీన్	9,657
పెసర	3,017
జొన్న	2,962
మొక్కజొన్న	855
ఇతర పంటలు	2,700

సాక్షి, ఆసిఫాబాద్: అన్నదాతలకు కేంద్ర సర్కారు శుభవార్త అందించింది. 2023- 24 వానాకాలం సీజన్‌కు సంబంధించి పలు రకాల పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) పెంచింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. పెసర పంటకు అత్యధికంగా కనీస మద్దతు ధరను పెంచారు. గతేడాది క్వింటాల్ ధర రూ.7,755 ఉండగా.. ఈసారి పెసర మద్దతు ధర రూ.8,558కి పెరిగింది. అలాగే వరి ధాన్యం సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.143 పెంచారు. గ్రేడ్- ఏ వరి ధాన్యానికి క్వింటాల్ ధర రూ.2,203, సాధారణ రకానికి మద్దతు ధర రూ.2,143 చెల్లించనున్నారు. పత్తి పొడవు పింజ రకానికి రూ.7,020, మధ్యస్థాయి పింజ రకానికి రూ.6,620 చొప్పున ఈ సీజన్‌లో ఇవ్వనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీటితోపాటు హైబ్రిడ్ జొన్న, జొన్న(మాల్దండి), రాగి, సజ్జలు, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు(విత్తనాలు), వేరుశెనగ, సోయాబీన్ మద్దతు ధరలు సైతం పెరిగాయి.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4.55 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో పత్తి పంట అత్యధికంగా 3.42 లక్షల ఎకరాల్లో సాగు కానుంది. గతేడాది పత్తి గ్రేడ్- ఏ పత్తికి కనీస మద్దతు క్వింటాల్‌కు రూ.6,380 ఉండగా ఈ ఏడాది క్వింటాల్‌పై రూ.640లు పెంచారు. దీంతో 2023- 24 సీజన్‌కు పత్తి మద్దతు ధర రూ.7,020కి చేరింది. పత్తిపై మద్దతు ధరను పెంచడంపై జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వరి పంట 58,770 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా దహెగాం మండలంలో 10 వేల ఎకరాల్లో వరి పంట వేస్తుండగా.. పెంచికల్‌పేట్, కౌటాల, బెజ్జూర్, సిర్పూర్, చింతలమానెపల్లి, తిర్యాణి, రెబ్బెన, కాగజ్‌నగర్ మండలాల్లోనే వరి సాగు అధికంగా ఉంటుంది. గతేడాది సాధారణ వరి మద్దతు ధర రూ.2,040, ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,060 చెల్లించారు. ఇక పత్తిలో అంతర పంటగా వేసే కంది జిల్లావ్యాప్తంగా 35వేల ఎకరాల్లో సాగవుతుంది. గతేడాది కంది క్వింటాల్‌కి కనీస మద్దతు ధర 6,600 ఉండగా.. ఈ ఏడాది రూ.350 పెంచారు. అలాగే హైబ్రిడ్ మొక్కజొన్నపై రూ.210, జొన్న (మాల్దండి)పై రూ.235 పెంచారు. సోయాబీన్‌పై రూ.300 పెంచినట్లు తెలిపారు. అత్యధిక మద్దతు ధర పెరిగిన పెసర పంట జిల్లాలో కేవలం 3,017 ఎకరాల్లోనే సాగు చేస్తున్నారు. మొత్తమ్మీద కేంద్రం పంటలపై కనీస మద్దతు పెంచడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు స్వల్ప ఊరట



కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధర పెంచడం హర్షనీయం. ప్రస్తుతం వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2,060 మాత్రమే చెల్లిస్తున్నారు. మద్దతు ధర పెరిగితే రైతులకు స్వల్ప ఊరట కలుగుతుంది. ఖర్చులు పెరిగిన నేపథ్యంలో దిగుబడి వచ్చినా అన్నదాతలకు లాభం ఉండటం లేదు. విత్తనాలు, ఎరువులపై రాయితీలు పెంచాలి. – దాసరి భీమయ్య, రైతు, దహెగాం

పత్తికి మరింత పెంచాలి



కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధరలు పెంచడం సంతోషంగా ఉంది. పత్తి సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలి ధరలు పెరిగాయి. రైతులకు గిట్టుబాటు కావాలంటే ప్రభుత్వం మద్దతు ధరను మరింత పెంచాలి. సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర పెంచితేనే ప్రయోజనం ఉంటుంది. – గట్టయ్య, యువరైతు, నాయకపుగూడ, తిర్యాణి

చెరువులకు పండుగొచ్చింది!



భిత్తర్‌మాల్ ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లు

- 59 చెరువుల వద్ద నేడు వేడుకలు
- బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపు
- అక్కడే భోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు

కెరమెరి(ఆసిఫాబాద్): చెరువుల పండుగకు సమయం ఆసన్నమైంది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 59 ప్రధాన చెరువుల వద్ద ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆయా మండలాల్లో ఎంపీడీవో, తహసీల్దార్లు వేడుకలకు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తున్నారు. చెరువుల వద్దకు వెళ్లేలా పిచ్చిమొక్కలు తొలగించి, ట్రాక్టర్లతో నేలను చదును చేస్తున్నారు.

59 చెరువుల వద్ద ఏర్పాట్లు

జిల్లాలో 335 గ్రామ పంచాయతీల్లో మొత్తం 261 చెరువులు ఉన్నాయి. ఇందులో 59 చెరువుల వద్ద ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బెజ్జూర్ మండలంలోని ఊరకుంట, అంబావాయి, గొల్లబాయి, నాగులమ్మ చెరువులతోపాటు కాగజ్‌నగర్‌లోని కొత్త చెరువు, లోయర్‌డ్యాం, ఆరెగూడ చెరువు, కోసిని బాలాసింగ్ రిజర్వాయిర్, సిర్పూర్(టి)లోని వెంపల్లి, పెద్దమ్మ, కంచెర్ల, వాదల చెరువులు, చింతలమానెపల్లిలోని బాబాసాగర్, చింతలమానెపల్లి చెక్‌డ్యాం, చింతర, ఊర చెరువు, పెంచికల్‌పేట్‌లోని ఊరకుంట, ఉచ్చమల్ల వాగు, లస్మాన్ చెరువు, దహెగాంలోని మూడు పెద్ద చెరువులు, గోపాల్ చెరువు, కౌటాలలోని న్యూట్యాంక్, కన్నెపల్లి, 3 ఊర చెరువులు, వాంకిడిలోని నవేదరి ట్యాంక్, చౌపన్‌గూడ ట్యాంక్, పేవతా చెరువు, రెబ్బెనలోని గొడిపెల్ల చెరువు, గోలేటి రిజర్వాయర్, మన్నెపల్లి, ఎల్లమ్మ చెరువు, జైనూర్‌లోని జైనూర్ బిగ్ ట్యాంక్, కొక్కగూడ ఎంఐ, జామ్ని, శివ్‌నూర్ ట్యాంక్, సిర్పూర్(యూ)లోని ధనోరా, శెట్టిహడ్పూర్, పెద్ద కోహినూర్, మార్లవాయి ట్యాంక్, లింగాపూర్‌లోని జగదాంబ, జాముల్‌ధర, టోర్‌పల్లి, చిన్నగూంనూర్ ట్యాంక్, కెరమెరిలోని అమ్మన్నమడుగు, ఝరి, భిత్తర్‌మాల్, చందుట్యాంక్, ఆసిఫాబాద్‌లోని సింగరావుపేట్, రౌటసంకేపల్లి, తుంపెల్లి, కొమ్ముగూడ, తిర్యాని మండలంలోని కొర్లొంక, ఏదులకుంట, బొట్టేజల్, పంగిడిమాదర ట్యాంక్ వద్ద ఉత్సవాలు నిర్వహించనున్నారు.

మిగిలిన జీపీల్లో కూడా..

ప్రకటించిన 59 ప్రధాన చెరువులతోపాటు గ్రామ పంచాయతీల్లో మిగిలిన చెరువుల వద్ద సైతం ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం ఉదయం సంబంధిత గ్రామం నుంచి ప్రజలు డప్పులు, బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా చెరువుల వద్దకు వెళ్తారు. కట్టపై ముగ్గులు, తోరణాలతో అలంకరిస్తారు. కట్టమైసమ్మకు పూజలు చేస్తారు. పంటల ఉత్పత్తి, భూగర్భ జలాల పెంపు, మత్స్య సంపద వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు అక్కడే చెరువు కట్టలపై సహపంక్తి భోజనాలు చేయనున్నారు.

ఆయకట్టు సాగు విస్తీర్ణం పెంచుతాం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- వట్టివాగు ప్రాజెక్టు వద్ద సాగునీటి దినోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఆయకట్టు సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆసిఫాబాద్ మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు వద్ద బుధవారం సాగు నీటి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 2014 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సాగునీటి పథకాలు, ప్రాజెక్టులు, చెరువుల నిర్మాణం పూర్తిచేసిందన్నారు. ఆయకట్టు చివరి వరకు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో దాదాపు 163 చెరువులను మిషన్ కాకతీయ పథకం కింద అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ కుమారస్వామి, ఈఈ గుణవంత్‌రావు, డీఈఈ అన్నాజీ, జేఈఈ జానీ, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రోత్సాహం

- బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం
- బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, అధికారులు

ఆసిఫాబాద్: కులవృత్తులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుదని, ఈ క్రమంలోనే బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంగారెడ్డి నుంచి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థికసాయం పథకాన్ని ఈ నెల 9న ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులపై విచారణ చేపట్టి, ప్రతీ నియోజకవర్గంలో అర్హులను గుర్తిస్తామని అన్నారు. లబ్ధిదారుల జాబితా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొందిన తర్వాత వెబ్‌సైట్‌లో ఉంచాలన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ బీసీ కులవృత్తుల వారు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కల్యాణ లక్ష్మి మినహాయించి, ప్రభుత్వ పథకాల ద్వారా రూ.50 వేల కంటే ఎక్కువగా లబ్ధి పొందని వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 14న నిర్వహించనున్న వైద్య దినోత్సవం సందర్భంగా ప్రతీ నియోజకవర్గానికి రూ.లక్ష నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖలో మంచి పనితీరు చూపిన అధికారులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు అవార్డుల ప్రదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వీసీలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా పనులు పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- 'మన ఊరు- మన బడి' పనులపై సమీక్ష



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వారంలోగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు భరత్, సుభాశ్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వట్టివాగు డైవర్షన్ పనులు పూర్తి చేయాలి

- సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) వెంకటేశ్వరరెడ్డి



పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఖైరిగూడ ఓసీపీ విస్తరణ కోసం చేపట్టిన వట్టివాగు డైవర్షన్ పనులు త్వరగా పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలో బుధవారం పర్యటించిన ఆయన ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత, సివిల్ పనులపై సమీక్షించారు. ఖైరిగూడ ఓసీపీ విస్తరణ పనుల్లో భాగంగా యాజమాన్యం చేపట్టిన వట్టివాగు డైవర్షన్ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమయ్యే లోగా సివిల్ పనులు, కట్టల నిర్మాణం వంటి పనులు పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు గోలేటిలోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమాల్లో ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో సత్యనారాయణ, డీజీఎం సతీశ్‌బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, డీవైపీఎం నాగుల వేణు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

కెరమెరి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలో బుధవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పీసీసీ సభ్యురాలు మర్సుకోల సరస్వతి హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ మండలంలో 500 మందితో రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. యువతకు కాంగ్రెస్ పార్టీ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం, నిరుద్యోగ భృతి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం కుసుంబ్‌రావు, సుదర్శన్, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

క్లుప్తంగా

విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి

దండేపల్లి(మంచిర్యాల): విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై కుందారపు ప్రసాద్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దుర్గం చిన్నక్క (70) బుధవారం ఉదయం ఇంటిముందు వాకిలి ఊడుస్తుండగా ఎల్‌టీ విద్యుత్ లైన్ తీగ తెగింది. గమనించని వృద్ధురాలు తీగను తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మనుమడు అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓబీ లక్ష్యాన్ని పెంచాలి

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్‌బర్డెన్ (ఓబీ) వెలికితీత లక్ష్యాలను మరింత పెంచాలని కంపెనీ డైరెక్టర్లు ఎస్.బలరాం (ఫైనాన్స్, పర్సనల్), జి.వెంకటేశ్వర్‌రెడ్డి (ప్రాజెక్ట్, ప్లానింగ్) సూచించారు. బుధవారం వీడియో కాన్ఫర్ కాన్ఫరెన్స్ ద్వారా ఏరియాల జీఎంలతో మాట్లాడారు. రెండు ఓసీపీల్లో నిర్దేశించిన ఓబీ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు.

చింతగూడ ఆలయంలో చోరీ

జన్నారం(ఖానాపూర్): మండలంలోని చింతగూడ లక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ ఈవో రమేశ్ తెలిపారు. బుధవారం ఉదయం పూజ చేసేందుకు అర్చకుడు వెళ్లి చూడగా నాలుగు హుండీలలో ఒకటి పగులగొట్టి ఉంది. అందులో సగం నగదు తీసుకుని మిగతాది వదిలేశారు. విషయాన్ని ఆలయ ఈవో రమేశ్‌కు, పాలక వర్గానికి తెలియజేయడంతో పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో సుమారు రూ.90 వేల వరకు నగదు ఉంటుందని ఈవో రమేశ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తానాజీ నాయక్ తెలిపారు.

సర్పంచ్ కుమారుడిపై అట్రాసిటీ కేసు నమోదు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని డబ్బా గ్రామ సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యాదవ్ తెలిపారు. తమను కులం పేరుతో దూషించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడని గ్రామానికి చెందిన కుమురం నారాయణ మంగళవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కార్యదర్శి సంతకం ఫోర్జరీ!

జన్నారం(ఖానాపూర్): ఇంటి రుణం కోసం కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన జన్నారం మండలంలోని ఇందన్‌పల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదే గ్రామంలో అసైన్డ్ భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఓ ప్రైవేట్ బ్యాంకులో రుణం పొందేందుకు సంప్రదించగా ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు కావాలనడంతో గ్రామ కార్యదర్శి బాపురావును అడిగాడు. తాను ఆ సర్టిఫికెట్ ఇవ్వలేనని తెలపడంతో స్టాంపులు తయారు చేసుకుని కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లను బ్యాంకులో అప్పగించాడు. బ్యాంకు సిబ్బంది ఈ నెల 3న ఇందన్‌పల్లికి వచ్చి కార్యదర్శిని సంప్రదించగా సర్టిఫికెట్ తాను ఇవ్వలేదన్నాడు. దీంతో బ్యాంకు అధికారులు రుణం రద్దు చేశారు. గ్రామంలోని కొందరు ఈ విషయం బయటకు రాకుండా చూడటానికి కార్యదర్శిపై ఒత్తిడి పెంచినట్లు తెలిసింది. కార్యదర్శి బాపురావును సంప్రదించగా సంతకం ఫోర్జరీ చేసింది నిజమేనని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

భార్య గొంతుకోసి హత్యాయత్నం

రామకృష్ణాపూర్: భార్యను గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన గంగాకాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన రిటైర్డ్ కార్మికుడు అన్నెడి బుచ్చిరెడ్డి, అతని భార్య మల్లవ్వకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలోనే బుచ్చిరెడ్డి కత్తితో మల్లవ్వ గొంతు కోశాడు. తీవ్రంగా గాయపడడంతో స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యంకోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

సీఎం సారూ.. పట్టించుకోండి

ప్రజలకు తాగు, సాగు నీటి అవసరాలు తీరుస్తున్న ఎల్లంపల్లి (శ్రీపాదసాగర్) ప్రాజెక్టు పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు. 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో బోటింగ్ సౌకర్యం కల్పిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. అంతేకాకుండా పర్యాటకులు సైతం మరింత ఆహ్లాదం పొందనున్నారు. పచ్చదనం పెంపొందించేలా ఎల్లంపల్లి దిగువన ఐటీడీఏ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్క్ ప్రస్తుతం కనుమరుగైంది. ఈ నెల 9న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో వీటిపై ప్రకటన చేయాలని కోరుతున్నారు.



- ఏటా 'ఎల్లంపల్లి'కి పెరుగుతున్న సందర్శకులు
- కానరాని బోటింగ్ సౌకర్యం
- కనుమరుగైన పార్కు
- నిధులు కేటాయించాలని స్థానికుల వేడుకోలు
- రేపు మంచిర్యాల జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–పెద్దపల్లి జిల్లాల మధ్య ఉన్న గోదావరినదిపై ప్రాణకోటికి కల్పవల్లిగా ఎల్లంపల్లి(శ్రీపాదసాగర్) ప్రాజెక్టు నిర్మించారు. జలయజ్ఞంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టుకు రూపకల్పన చేయగా 2008 జూలై 28న శంకుస్థాపన చేశారు. ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలను సైతం ప్రాజెక్టు తీరుస్తోంది. రామగుండం ఎన్టీపీసీ, రాజధాని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతోంది.

సాగు.. తాగునీరు

62 గేట్లతో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్ట్‌ను దాదాపు రూ.4,950 కోట్లతో రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. ప్రాజెక్ట్ కింద 7,500 ఎకరాల సాగుభూమి ముంపునకు గురి కాగా 1.118 కిలో మీటర్ల మేర 4 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. సుజల స్రవంతి పథకం కింద హైదరాబాద్‌కు రోజుకు 220 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని ప్రజలకు ఇంటింటికీ గోదావరి తాగునీరు సరఫరా అవుతోంది.

పర్యాటక ప్రదేశమే...

ఎల్లంపల్లి ప్రాజెక్ట్, పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పం ముందుకు సాగడం లేదు. జాతీయ రహదారికి కేవలం మూడు కిలో మీటర్ల పరిధిలో గోదావరి నదిపై 62 గేట్లతో భారీ ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది. నిత్యం నిండు కుండలా దర్శనమిస్తున్న ప్రాజెక్ట్ పర్యాటకులను కనువిందు చేస్తోంది. ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన సుందరమైన పార్కు చూపరులను ఆకట్టుకుంటోంది. 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న బ్యాక్ వాటర్‌లో బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు మరింత ఆహ్లాదం పంచుతుంది. ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతాయి.

సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి

2019 ఫిబ్రవరిలో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేతుల మీదుగా హాజీపూర్ మండలంలోని గుడిపేట జాతీయ రహదారి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా దాదాపు రూ.8 కోట్ల 98 లక్షల 50 వేలతో పనులు పూర్తి చేశారు. జాతీయ రహదారి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వరకు రోడ్డుకు మధ్యలో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోనుంది.

కనుమరుగైన పార్కు

ఎల్లంపల్లి దిగువ భాగాన ఏర్పాటు చేసిన పార్కు ఇప్పుడు కనుమరుగైంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కును అందంగా తీర్చిదిద్దినప్పటికీ ప్రస్తుతం కనుమరుగైంది. ప్రాజెక్ట్ పరిసరాలన్నీ పచ్చదనం పరుచుకునేలా చేస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. ప్రాజెక్ట్‌లో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసి టూరిజంగా కూడా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ కాస్త కోటిలింగాలకు వెళ్లింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు మంజూరైన మర పడవ(బోట్) కోటి లింగాలలో పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ టూరిజంగా అభివృద్ధి సాధించాలంటే సీఎం కేసీఆర్ దీనిపై ప్రకటన చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కలగానే ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ప్రభుత్వ స్థలాలు ఉన్నా తప్పని ఎదురుచూపులు
- ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్‌ను 2016లో మండలంగా ప్రకటించారు. ఆరేళ్లు కావస్తున్నా మండలంలో జూనియర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులకు ఉన్నత చదువులు అందని ద్రాక్షగా మారాయి.

విద్యార్థులకు తప్పని తిప్పలు

హాజీపూర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు, 21 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల, 10 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో రెండు పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉండగా ఏటా 500ల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్ చదివేందుకు మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో ఎంతో వ్యయప్రయాసలకోర్చి పది నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల, లక్సెట్టిపేటకు వెళ్తున్నారు. ఆర్థికభారంతో కొంతమంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసి కూలి పనులకు వెళ్తున్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ జిల్లాకు రానున్న నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరంలోనైనా హాజీపూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.


హాజీపూర్ మండల కేంద్రం


నిండా ముంచిన వైన్ యాప్!

- పెటేగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు
- యాప్‌ల పేరిట బురిడీ కొట్టిస్తున్న మోసగాళ్లు

చెన్నూర్: సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త యాప్‌లతో లాభాల ఆశలు చూపి కోట్లు కొల్లగొడుతున్నారు. వైన్‌యాప్ పేరుతో చెన్నూర్ మండలానికి చెందిన అమాయకులను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొంతమంది వైన్ వ్యాపారం పేరుతో యాప్ ఏర్పాటు చేశారు. వచ్చిన ఆదాయాన్ని పెట్టుబడిదారులకు రెట్టింపు లాభాలను పంపిస్తామని ఆశ చూపారు. కొత్తలో పెట్టిన పెట్టుబడికి లాభాలను పంపించి నమ్మించారు. దీంతో చైన్ సిస్టమ్ ద్వారా లక్షలాది మంది యాప్‌లో చేరారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని ఆశపడ్డ ప్రభుత్వ, ప్రైవేట్, సింగరేణి ఉద్యోగులతో పాటు చిరువ్యాపారులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. బిచానా ఎత్తేయడంతో లబోదిబో మంటున్నారు. జిల్లాలోని చెన్నూర్, కోటపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, సింగరేణి ప్రాంతానికి చెందిన వారు పెద్ద ఎత్తున ఉన్నట్లు తెలిసింది.

లాభాల ఆశతో...

చెన్నూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన నరిశెట్టి రాకేశ్ గత నెల 18న వైన్ యాప్‌లో చేరి రూ.37,500 పెట్టుబడి పెట్టాడు. 19 నుంచి రోజుకు 2,268 చొప్పున పది రోజుల పాటు రూ.22,680 వచ్చాయి. దీంతో అతని ఆశకు అంతులేకుండా పోయింది. తన భార్య పేరిట మరో రూ.55వేలు పెట్టాడు. పది రోజుల పాటు లాభాలను పంపించిన నిర్వాహకులు గత నెల 30 నుంచి ఆపేశారు. యాప్‌లో డబ్బులు ఫెయిల్ అని కన్పించడం ప్రారంభించింది. మోసపోయానని గుర్తించాడు. జిల్లాలో రాకేశ్ లాంటి వారు వేలాది మంది ఉన్నారు.



రూ.55 వేలు చెల్లించిన గౌతమి



వైన్ యాప్‌లో ఉన్న మోడల్స్

నాలా ఎవరూ మోసపోకండి



చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఈజీమనీకి ఆశపడి మోసపోయా. సైబర్ నేరగాళ్లు అమాయకులకు డబ్బు ఆశచూపి దండుకుంటున్నారు. నాలా చాలామంది మోసపోయారు. ఎవరూ బయటికి రావడం లేదు. మరికొంత మంది మోసపోవద్దని ముందుకు వచ్చా. – నరిశెట్టి రాకేశ్, గంగారం, చెన్నూర్

అత్యాశకు పోవద్దు



సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు ఎక్కువగా ఇస్తామంటే అత్యాశకు వెళ్లి మోసపోవద్దు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ఇప్పటి వరకు వైన్ యాప్ బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. పోలీసులను సంప్రదిస్తే పరిశీలిస్తాం. – వాసుదేవరావు, సీఐ చెన్నూర్

అధికారుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అధికారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు కేహెచ్‌ఎన్ గుప్తా బుధవారం సింగరేణి డైరెక్టర్(పీఅండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీలో పని చేసే జనరల్ షిఫ్ట్ అధికారులకు ఏసీ బొలేరో వాహనాలు ఇవ్వాలని, జీఎం ఆఫీస్‌లో పనిచేసే హెచ్‌ఓడీలకు ఏసీ చాంబర్‌ను ఏర్పాటు చేయాలని, యూనిట్ లెవల్‌లో పనిచేసే అధికారులకు ఫీల్డ్ అలవెన్సు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం దేవేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఎన్.సత్యనారాయణ, డీజీఎం సతీష్‌బాబు, సర్వే అధికారి చంద్రశేఖర్, పీఈ రాజాజీ, మేనేజర్ ప్రవీణ్ ఫటింగ్, డీవైపీఎం వేణు, తదితరులు పాల్గొన్నారు.


డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అధికారులు

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


సాగర్ మృతదేహం

కౌటాల(సిర్పూర్): ప్రేమించిన అమ్మాయి తనకు దక్కదేమోనని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోయగూడ గ్రామానికి చెందిన నైతం సాగర్(22)కు వివాహం జరిపేందుకు తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో తాను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని, తనకు పెళ్లి సంబంధాలు చూడవద్దని తల్లిదండ్రులను కోరాడు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, తల్లిదండ్రులు చెప్పడంతో మనస్తాపంతో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బుధవారం మృతుని తండ్రి నైతం జగన్నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న జక్కుల రాజేశం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల రాజేశం డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైపర్ కమిటీ వేతనాలను చెల్లించకపోవడం వలన శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. సింగరేణి వ్యాప్తంగా 26 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి శ్రమకు తగ్గ ఫలితం దక్కడంలేదన్నారు. ఓబీ సంస్థలకు లేబర్ లైసెన్స్ కలిగి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ఓపెన్ కాస్ట్ పనుల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఈ నెల 9న నస్పూర్‌కు వస్తున్న సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, నాయకులు గణపతి, సత్తన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ పరికరాలు ధరించాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఉద్యోగులు విధి నిర్వహణలో రక్షణ పరికరాలు ధరించాలని శ్రీరాంపూర్ బీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ శాఖ అధికారులతో గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డైరెక్టర్ మైన్స్(డీఎంఎస్) ఎన్.నాగేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్(డీడీఎంఎస్) కే ప్రేమ్‌కుమార్, బీ.వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ భూగర్భ గనులు, ఉపరితల గనుల్లో ఉద్యోగులు సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పాటిస్తూ పనిచేయాలన్నారు. ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దడానికి రక్షణ నియమాలు పాటించాలన్నారు. సమావేశంలో డీఎంఎస్ నాగేశ్వరరావు, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఓసీపీ అధికారులు ఎం.శ్రీనివాస్, వి పురుషోత్తం, ఏజెంట్లు ఏవి రెడ్డి, రాముడు, అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

ఆర్కే 7గనిని తనిఖీ చేసిన డీడీఎంఎస్

ఆర్కే 7 గనిని డీడీఎంఎస్ ప్రేమ్ కుమార్ తనిఖీ చేశారు. ఏరియా రక్షణాధికారి శ్రీధర్, గ్రూప్ ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయి ప్రసాద్ గనిలోకి దిగి 2ఏఎస్ 22 ప్యానెల్ పని స్థలాల్లో తనిఖీ నిర్వహించారు. గని రక్షణాధికారి రవిశంకర్, అండర్ మేనేజర్ రమేశ్, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సర్వేఆఫీసర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

11న 'ప్రజాగర్జన'కు తరలిరావాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 11న కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజాగర్జన బహిరంగసభకు సింగరేణి కార్మికులు అధికసంఖ్యలో తరలిరావాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. బుధవారం ఎస్సార్పీ 1 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేశామన్నారు. కోల్ ఇండియాలో అక్కడి కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయ పన్ను యజమాన్యమే చెల్లిస్తుందని, సింగరేణిలో కూడా యజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాజీ సైదా, కే వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య కిషన్ రావు, నాయకులు చంద్రమోహన్, గునిగంటి నర్సింగ్ రావు, పిట్ సెక్రెటరీ దాడి రాజయ్య, నాయకులు అఫ్రోజ్ ఖాన్ మురళీచౌదరి లక్ష్మణ్, అనంత రెడ్డి, వేణు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

సీఎం హామీలు అమలు చేయాలి

- సీఐటీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరాంపూర్‌లో జరిగిన బహిరంగ సభలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే రెండు పేర్లతో ఉన్న ఉద్యోగుల పేర్లను క్రమబద్ధీకరిస్తామని, కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని, హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, డిపెండెంట్ పిల్లల వయస్సు 35 నుంచి 45కు పెంచాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్‌లో ఆర్‌ఎల్‌సీ సమక్షంలో జరిగిన ఒప్పందాలను కూడా కంపెనీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి భాగ్యరాజ్, నాయకులు శంకర్, శ్రీనివాస్, రాజయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద నర్సింహారావు